


# స్వాతంత్ర్యం

## రావినూతల సువర్ణకన్నన్

అది ఒక మహానగరం.

ఊరంతా నిద్రావస్థలో వుండే అర్ధరాత్రి!

సరిగ్గా నలభై ఏళ్ళ క్రితం మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయం.

రేపే ఆగస్టు పదిహేను!

నలభై సంవత్సరాల ప్రగతిని నెమరువేసే శుభ సమయం!

స్వాతంత్ర్య సమరంలో అశువులు బాసిన అమరవీరులకు అంజలి ఘటించే తరుణం!

ఆ సమయంలో ఆకాశం నిండా కారు మేఘాలు కమ్మి ప్రళయం వస్తున్నట్టు ఈదురు గాలి, వురుములు, మెరుపులు మొదలయ్యాయి.

ఊరికి దూరంగా వున్న ఓ చిన్న గుడిసెలాంటి ఇల్లు. ఆ ఇంటిలో కుక్కిమంచంలో పడుకుని సన్నగా గురకపెడుతోంది ఎనభైయ్యేళ్ళ పార్వతమ్మ. ఆమె పక్కగా చింకిరి చాప మీద కూర్చుని ఏదో కుట్టు కుంటున్నాడు ఆమె మనవడు పదేళ్ళ నేతాజీ.

గాలికి గుడ్డిగా వెలుగుతున్న చిమ్నీ ఆరిపోతోంది. పదే పదే వెలిగిస్తున్నాడా పిల్లాడు.

ఎందుకో కళ్ళు తెరిచి చూసిన పార్వతమ్మ కళ్ళకి

# సేవా దీపాలు

(పద్య కవిత)

శ్రీలు వెలసిల్లు సౌభాగ్య సీమయందు
పుట్టినావమ్మ దివ్వెవై పూజ కొఱకు
నీదు పాతివ్రత్యమ్ము మా నిష్ఠయగును
తెలుగు హృదయాల వెల్గుమో దీపబాల!

*    *

స్వామి నీరాజనమ్ముకై సరస నుండి
స్వామి సేవలో మునిగిన సౌమ్యశీలి!
నీకు జోహారులర్పింప నిష్ఠతోడ
దివ్య తేజస్వివై వెలుగు దీపబాల!

*    *

అంధకారమ్ము నిండిన ఆత్మలందు
కాంతి నింపినావమ్మ ప్రశాంతి వగుచు
నీదు ఆదర్శమే మాకు సాధనమ్ము
తిమిర సంహార! సుగుణాల దీపబాల!

*    *

నేటి బాలలే రేపటి నేతలవగ
జ్ఞాన దీపమై వెలుగొందినావు నీవు
నీదు జ్ఞానమే మాపాలి వేదమవగ
దిశలు, దెసలెల్ల వెలుగుమో! దీపబాల!

*    *

మెచ్చినాడమ్మ నిను గాంధి మేటి యనుచు
వచ్చినాడమ్మ దీవింప వనజభవుడు
ఇచ్చినాడమ్మ నీ కొక సచ్చరిత్ర
దివ్య సందేశ సద్భాల! దీపబాల!

—శేషం సుప్రసన్నాచార్యులు

సూదీ దారంతో ఏదో గుడ్డ కుడుతున్న మనవడు కనిపించి మెల్లగా లేచి -

"ఏమిటి నేతా అది?" అంది.

"లాగూ, చొక్కా బామ్మా.. కుట్టుకుంటున్నాను" అన్నాడు నేతాజీ.

"ఎక్కడివి?" తెల్లని చొక్కా, నీలం నిక్కరు శిథిలావస్థలో వున్నాయి. గుడ్డపీలికలా వుంది ఓ నీలం పైౖ.

"మా ఓనరుగారబ్బాయివి. అడిగి తెచ్చుకున్నాను" అన్నాడు నేతాజీ మెరుస్తున్న కళ్ళతో.

పార్వతమ్మ మొహం వెలవెలపోయింది.

"ఎవరో ఇచ్చిన పాత లాగూ, చొక్కా కుట్టుకుని వేసుకుంటావా?" అంది మెల్లగా.

"రేపొక్కరోజే బామ్మా! ఇంకెప్పుడూ అలా వెయ్యను" వాడి కళ్ళలో వేడికోలు కనిపించింది.

"నీకు..ఇంకో లాగూ, చొక్కా వుందిగా?"

"కానీ అవి వేసుకుంటే స్కూల్లోకి రానివ్వరు" దీనంగా అన్నాడు నేతాజీ.

"స్కూల్ కా?" త్రుళ్ళిపడింది పార్వతమ్మ.

ఆమె భయానికి నవ్వాడు నేతాజీ.

"అది కాదు బామ్మా! ... మన జయంతిగారి స్కూల్లో పిల్లలంతా కలిసి జండా ఎగరేస్తారుకదా.. నాకూ వాళ్ళతో కలిసి ఒక్కసారి జండా వందనం చేయాలనుంది బామ్మా!.." అన్నాడు.

"కానీ .. నిన్ను ఆ ఆవరణలోకే రానివ్వరు నాన్నా" బాధగా అందామె.

"అందుకే ఈ బట్టలు! .. ఈ బట్టలు వేసుకుంటే నేనూ వాళ్ళలో కలిసిపోతాను. దగ్గరికొచ్చాక చూసినా అందరూ వుంటారుగా-అప్పుడు ఏం అనరు. జయంతి గారు నీకు బాగా తెలుసుగా! ఏదైనా సర్ది చెప్పుగాని" ఆశగా అన్నాడు నేతాజీ.

పార్వతమ్మ మొహం మరింత పాలిపోయింది.

స్వాతంత్ర్య సమరంలో అశువులు బాసిన భర్తని, పసి కందుని భూమ్మీద పడేసి పెద్దల్లో కలిసిపోయిన కోడల్ని, వరదల్లో కొట్టుకుపోతున్న వాళ్ళని రక్షించబోయి తనే వరదపాలయిపోయిన కొడుకు నెహ్రూని తల్చుకుని మూగగా రోదించింది. పసివాడికింత చదువు చెప్పించ లేని తన అసమర్థతకి తనని తానే తిట్టుకుంది.


మరో నిమిషానికల్లా లాగూ, చొక్కాలకున్న చిరు గుల్ని సాధ్యమయినంతవరకు కుట్టడం ముగించి తృప్తిగా లేచాడు నేతాజీ.

"ఇక పడుకో నాన్నా" అంది పార్వతమ్మ.

చాప మీద పడుకున్నాడు నేతాజీ.

ఆ పసివాడి మనసంతా రేపు జరగబోయే స్వాతంత్ర్యోత్సవ వేడుకల మీదే వుంది. వాడి కళ్ళ ముందు దేశమాతని చెర నుంచి తప్పించిన అమరవీరులు మెదులుతున్నారు.

వాడికి అన్ని పండుగలకన్నా ఈ స్వాతంత్ర్యదినం అంటేనే ఎక్కువ ఇష్టం.. గాంధి, నెహ్రూలంటే ప్రాణం. దేశభక్తి వుగ్గుపాలతోపాటు రంగరించి పోసింది పార్వతమ్మ.




వాడికి శిరిసంపదలు లేవు. కానీ, వాడి రక్తంలో దేశభక్తి కలిసి ప్రవహిస్తోంది. స్కూల్ మొహం చూడ లేదు. కానీ, నిరక్షరాస్యుడు కాదు.

జండా కొని ఎగురవేసే స్తోమత లేకపోతేనేం - తాత, తండ్రులు ఎగరవేసిన పవిత్ర పతాకం అతని పెట్టె అడుగున భద్రంగా వుంది. దాన్ని దులిపి పొద్దునే సిద్ధం చేసుకున్నాడు ఇంటి ముందు ఎగరెయ్యడానికి.

స్కాలర్‌షిప్ పొందే అర్హతలేదు. కానీ పంతులుగారి మనవడు అన్న ఆదరం వుందా ప్రాంతంలో. తాత, తాతతో పాటు బామ్మ ఎన్నోసార్లు జైలుశిక్ష అనుభవించారని, లాఠీ దెబ్బలు తిన్నారని, చివరికి తాత స్వాతంత్ర్యం రాకుండానే ఆ పోరాటంలోనే వీర మరణం పొందారని తెలుసు.

అంతేకాదు. వింత మాద్దానికొచ్చి పారిపోలేక లాఠీ దెబ్బలు తిన్నవాళ్ళూ, బ్రిటిష్‌వాళ్ళకి సాయం చేస్తూ మాతృదేశానికే ద్రోహం చేసినవాళ్ళూ స్వాతంత్ర్యం రాగానే ప్లేట్ ఫిరాయించి జండాలుమార్చి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నవారమని నమ్మబలికి పొలాలూ, స్థలాలు తీసుకున్నవాళ్ళూ చాలామందే వున్నారని విన్నాడతను. పార్వతమ్మ కూడా మరో గత్యంతరం లేక వున్న ఒక నలుసుని బతికించుకోవడం కోసం తమని గురించి ప్రభుత్వానికి చెప్పుకోవడానికెళ్తే దైవదర్శనం కాకుండా, బైట వున్న పూజారులే —

"మీరు జైలుకెళ్ళినట్టు ప్రూఫ్స్ వున్నాయా? మిమ్మల్ని అరెస్ట్ చేసినట్టు రుజువు చెయ్యగలరా? మీరు లాఠీ దెబ్బలు తిన్నారని నమ్మకం ఏమిటి?" లాంటి ప్రశ్నలు వేసి, ఆ యక్ష ప్రశ్నలకి జవాబులు చెప్పలేని పార్వతమ్మని చూసి అవహేళన చేసి పంపారనీ తెలుసా పసివాడికి.

అందుకే వాటి గురించి ఆలోచించడతను. మొన్న మొన్నటిదాకా పార్వతమ్మ ఏవో పని పాటలు చేసి రెండు పొట్టలూ నింపినా, ప్రస్తుతం వార్ధక్యం మీదపడి ఆమెని నిస్సహాయురాలిని చేస్తే, ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ తనే ఇంటికి ఆధారం అయ్యాడు.

వాడికి చిన్నతనం నుంచీ మంచి కాన్వెంట్‌లో చేరి చదువుకోవాలని ఆశ. ఆ ఆశ నెరవేరదని తెలుసా పసివాడికి. కానీ, ఒక్కసారి ఆ విద్యార్థులతో కలిసి జండా వందనం చెయ్యాలన్న కోరిక మాత్రం చావడం లేదు. రాత్రింబవళ్ళు ఆలోచించి పెట్రోల్ బంక్‌లోని మరో కుర్రాడి సలహా ప్రకారం ఆ స్కూల్ విద్యార్థిలాగే ఉత్సవాల్లో పాల్గొనాలనుకున్నాడు. అందుకే తగ్గ ప్రయత్నాలు చేసుకున్నాడు.

అలా కలతనిద్రలోనే తెల్లవారింది. చకచక లేచి స్నానపానాలు కానిచ్చాడు నేతాజీ. యూనిఫారమ్ వేసుకున్నాడు.

వెలిసిపోయిన నిక్కర్‌కి తెల్లదారంతో చేతనయీ కానట్టు కుట్టిన కుట్లు అసహ్యంగా కనిపిస్తున్నాయి. చొక్కా పొట్లపందులా ముట్టుకుంటే పిగిలిపోయేలా వుంది. తల నున్నగా దువ్వుకొని బామ్మ దగ్గరికొచ్చాడు.

"బంగారు తండ్రిలా వున్నావు నాన్నా" మురిపెంగా అంది పార్వతమ్మ. వాడు సిగ్గుపడ్డాడు.

ఏడు గంటలవుతుండగా బామ్మా, మనవడు కలిసి

వీథి గుమ్మంలో పాతిన వాసానికి శిథిలావస్థలో వున్న జాతీయ జండా ఎగరేశారు. జాతీయగీతం పాడారు. దేశ స్వాతంత్ర్యం రావడానికి కారకులయిన పెద్దలకి నివాళు లర్పించారు.

"బామ్మా! ఇంక నేను కాన్వెంట్ కెళ్తాను" పై పవరించుకుంటూ అన్నాడు నేతాజీ.

"వెళ్ళిరా నాన్నా!" వాడి చెంపలు పుణికి ముద్దు పెట్టుకుంటూ అంది పార్వతమ్మ.

నేతాజీ ఉత్సాహంగా బైటికి పరిగెత్తాడు. అక్కడికి కిలోమీటరు దూరంలో వుంటుందా · కాన్వెంట్. ఉత్సాహంలో వాడికి అలసటే తెలియలేదు.


తెల్లవార్లూ వాన పడ్డంతో రోడ్డంతా చితచితలాడు తోంది. మెయిన్ రోడ్ ఎక్కి కాన్వెంట్ పరిసరాల కొచ్చేశాడు నేతాజీ.

అక్కడంతా ఒకటే హడావిడి.

వాడు ఓసారి హడావిడిగా తిరుగుతువ్న స్టూడెంట్స్ని చూశాడు. మళ్ళీ తనని చూసుకున్నాడు. వాడి కళ్ళలో నిరాశ చోటుచేసుకుంది.

వాళ్ళ బట్టలు, షూస్ మెరిసిపోతుంటే తన బట్టలు ముష్టివాడి బట్టల్లా వున్నాయి. కాళ్ళకి చెప్పులు కూడా లేవు. వాళ్ళు తనని ఆ స్కూల్ విద్యార్థి కాదని తరిమేస్తారేమో అని కూడా భయపడ్డాడు. అయితే వాడిని ఎవరూ గమనించేలా లేరు. ఎవరి గొడవలో వాళ్ళున్నారు.

పెద్దలంతా మంత్రిగారి రాకకోసం ఆదుర్దాగా




ఎదురుచూస్తున్నారు.

పది గంటలు దాటాక వచ్చారు మంత్రిగారు.

ఆ ప్రాంతాలకంతా కలిగిన ఇల్లాలు, ఓ పెద్ద క్లబ్‌కి ప్రెసిడెంట్ అయిన జయంతి నిలువెత్తు పూలదండతో ఎదురెళ్ళి బిత్తరపోతున్న మంత్రి పుంగవుల మెడలో పూలదండ వేసేసి చప్పట్లు కొట్టేసింది.

మిగతావాళ్ళు చప్పట్లతో అదరగొట్టేశారా ప్రాంత మంతా.

వాళ్ళ హడావిడి చూసి-'అమ్మయ్య, నన్నెవరూ గుర్తించలేదు' అనుకున్నాడు నేతాజీ.

స్కూల్ పిల్లలంతా బారులు తీరారు. వి.ఐ.పి. పిల్లలు కొందరు మంత్రిగారిని జండా దగ్గరికి తీసుకు రావడానికి వలయం కట్టారు.

కడిగిన ముత్యాల్లా వున్న విద్యార్థుల మధ్యకి ఎలాగో చేరాడు నేతాజీ.

మంత్రిగారు ఓసారి చిరునవ్వులు చిందిస్తూ అందర్నీ పరికించి చూశారు.

కెమేరాలు క్లిక్ మంటున్నాయి.

విడియో కేసెట్ తిరుగుతోంది.

జయంతిగారి ముద్దుల తనయుడు మంత్రిగారికి పుష్పగుచ్ఛం అందించి జండా దగ్గరికి తీసుకొచ్చాడు.

మంత్రిగారి మొహంకన్నా తన కొడుకు మొహమే క్లోజప్‌లో చాలాసార్లు కనిపించాలని హెచ్చరించిందేమో జయంతి, విడియోవాళ్ళు నల్లగా పీనుగులా వున్న ఆ కుర్రాడినే ఎక్కువగా క్లోజప్‌లో తీస్తున్నారు. మురిసి పోయింది జయంతి.

అలవోగ్గా పరికించిన ఆమె కళ్ళకి ఒదిగొదిగి నిల్చున్న నేతాజీ కనిపించాడు.

అంతే, ఆమె మొహం వికృతంగా అయిపోయింది. ఆమె అలా వుండగానే జండా ఎగరేశారు మంత్రిగారు. జాతీయగీతం పాడారు. ప్రతిజ్ఞ చేశారు. పెద్దలంతా మాట్లాడారు.


దీపావళి శుభాకాంక్షలతో!

USHA PICTURES ELURU

ఉషా పిక్చర్స్

సోమంచివారి వీథి, పవర్‌పేట, ఏలూరు-2

మేనేజింగ్ పార్ట్నర్: వి.వి. బాలకృష్ణారావు

* * *

ఉషాబాల చిట్స్ & ఇన్‌వెస్ట్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్

చలసాని బిల్డింగ్స్, ఏలూరు-2, ప.గో. జిల్లా

మేనేజింగ్ డైరెక్టర్: వి.వి. బాలకృష్ణారావు

ఫోన్స్: 20657, 20990 & 21737

వాళ్ళ మాటలు తన్మయత్వంగా, భక్తి శ్రద్ధలతో విన్నది ఒక్క నేతాజీనే అనిపిస్తుంది వాడిని చూస్తుంటే. వందేమాతరం పాడేటప్పుడు, జన గన మన పాడేటప్పుడు వాడి మొహం వెలిగిపోయింది. పేదరికాన్ని, అంటరానితనాన్ని ఎలా రూపుమాపాలో బాపూజీ కలల్ని నిజం చేస్తూ అందరూ ఎలాంటి మార్గంలో పయనించాలో, మానవులంతా ఒకటే అని పసిపిల్లలకి ఎలా బోధించాలో మాట్లాడారు పెద్దలు. ఆ పెద్దల్లో జయంతి కూడా వుంది. వారి మాటలు పన్నీటి చినుకుల్లా తోచాయి నేతాజీకి. ఫంక్షన్ తరువాత పేద విద్యార్థులకి పుస్తకాలు, ధన సహాయం లాంటివి, కొత్త బట్టలు లాంటివి అందచేశారు మంత్రిగారు.

సాధారణంగా ఫంక్షన్ హడావిడిగా ముగించేసి వెళ్ళిపోవడం జరుగుతుంది. కానీ జయంతిగారి పరపతితో ఆ పూట టిఫిన్ తీసుకోవడానికి వుండిపోయారు మంత్రిగారు.

అందరూ బారులు తీరి కూర్చున్నారు. యూనిఫారమ్స్‌లో వున్న బేరర్స్ సర్వ్ చేస్తున్నారు.

నేతాజీకి వెర్రి ఆనందంగా వుంది.

చిన్నతనం నుంచీ పెరిగిన కోరిక ఈనాటితో తీరింది.

'ఇవన్నీ బామ్మతో చెప్పాలి' అనుకున్నాడు ఉత్సాహంగా. వాడికి హఠాత్తుగా ఆకలి గుర్తొచ్చింది సర్వ్ చేస్తున్న టిఫిన్స్ చూడగానే. తనూ వెళ్ళి ఓ చోట కూర్చున్నాడు. అందరూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ తింటున్నారు. దూరం నుంచి నేతాజీని గమనించిన జయంతి తుపానులా వచ్చిందక్కడికి.

"లే ముందు!" అంది కాళిలా. నేతాజీ త్రుళ్ళిపడ్డాడు. కాళిలా వున్న ఆమెను చూసి ఒణికిపోయాడు.


"రాస్కెల్!..ఎంత ధైర్యంరా నీకు! నువ్వు ఆ పార్వతమ్మ మనవడివి కదూ!.." కళ్ళెర్రచేసింది జయంతి.

"అవునండీ! మా బామ్మ మీ ఇంటికి ఒడియాలు పెట్టడానికొచ్చేది కదూ.." అమాయకంగా అన్నాడు నేతాజీ.

మరింత మండిపడింది జయంతి. వాడి జుట్టు పట్టుకుని లేవదీసి "ముందు బైటికి ఫో!" అంది విసురుగా తోస్తూ. వాడు వెళ్ళి అల్లంత దూరాన పడ్డాడు. టిఫిన్ అంతా నేలపాలయింది.

"డర్టీ రోగ్స్! ఛ! వీళ్ళకి అలుసిస్తే నెత్తికెక్కుతారు. ముందు వీణ్ణి మెడపట్టి గెంటండి" అరిచింది జయంతి.

నేతాజీ పసి మనసు దెబ్బతింది. ఉక్రోషం వచ్చింది. "నేను డర్టీ రోగ్‌నా? నాకు డబ్బు లేదు. అంతేగా! కులంలో, గుణంలో అన్నింటిలోనూ నేనే అధికుణ్ణి! మా తాతగారు స్వాతంత్ర్య పోరాటంలో అమరులయ్యారు. మా బామ్మ తాతగారితో కలిసి ఎన్నోసార్లు జైళ్ళకెళ్ళింది. లాఠీ దెబ్బలు తింది. ఈనాడీ ఉత్సవాలు చేసుకోవడంలో మా కుటుంబానిక్కూడా అర్హత వుంది. ఇదంతా నేనే స్వయంగా ఆ మంత్రిగారికి చెప్తాను. మా తాతగారు ఆయనకి తప్పకుండా తెలిసే వుంటారు" తనని తాను మరచి ఆవేశంలో గబగబా అనేసి విసురుగా




మంత్రిగారున్న వైపు కెళ్ళబోయాడు నేతాజీ.

కొయ్యబారిపోయిన జయంతి తేరుకునేసరికి కళ్ళు ఎర్రబడిపోయాయి. పాములా బుసలు కొట్టింది. ఉచ్చం, నీచం పూర్తిగా విస్మరించి వాడి రెక్క పట్టుకుని ఇష్టం వచ్చినట్టు బాదేసింది.

ఆవేశం చల్లారక వాణ్ణి ఈడ్చుకెళ్ళి రోడ్డుమీదికి నెట్టి ".. రాస్కెల్ నీ దిక్కున్న చోట చెప్పుకో" అంది ఆవేశంగా. నేతాజీ విసురుగా వెళ్ళి రోడ్డు మధ్యగా పడ్డాడు. తల రోడ్డుకి తగలడం మూలంగా దిమ్మెరపోయాడు. అప్పుడే మరో దారుణం జరిగిపోయింది.

ఓ సభలో జండా ఎగరేసి, మరో సభలో ఎగరెయ్యడానికి హడావిడిగా వెడుతున్న ఓ దేశోద్ధారకుని కారు నేతాజీ మీదుగా వెళ్ళి పది గజాల దూరంలో ఆగింది.

నేతాజీ తెల్లని చొక్కా ఎర్రగా అయిపోయింది. కష్టపడి కుట్టుకున్న పాత యూనిఫారమంతా పీలికలుగా రూపుదాల్చింది. వాడి ప్రాణం మాత్రం ఎక్కడో కొట్టుకుంటోంది.

అలాంటి సమయంలో కూడా వాడి కళ్ళ ముందు రెండు దృశ్యాలు కదలాడుతున్నాయి. ఒకటి, తుపాకీ గుళ్ళు తగిలి నేలకొరిగిన స్వాతంత్ర్య సమరయోధులు, రెండు తన కోసం కళ్ళలో వత్తులు వేసుకున్నట్టు ఎదురుచూసే వృద్ధురాలయిన బామ్మ! కొన్ని క్షణాలు ఆ స్థితిలో వుండి మెల్లగా కళ్ళు మూశాడు. వాడిలో చలనం ఆగిపోయింది.

దేశోద్ధారకుడికి తన పనికి అంతరాయం కలిగించిన నేతాజీ మీద అమిత చిరాకు కలిగింది. విసుగ్గా కారు దిగి దగ్గరికొచ్చి పసివాడి శవాన్ని చూసి - "చచ్చాడా?" అన్నాడు డ్రైవర్‌తో.

"పోయాడు సర్" అన్నాడతను.

"ఛ!ఛ! వెధవలకి డిసిప్లిన్ లేదూ, పాడూ లేదు. రోడ్ రూల్స్ ఆంతకన్నా తెలిసి చావదు! ప్చ్! ఇది వీళ్ళ తప్పు కాదు. వీళ్ళని కని వీధిన పడేసిన వీళ్ళ తల్లిదండ్రుల్నవాలి. ఈ దేశం బాగుపడదు" అన్నాడు అదోలా ఫిట్టూరుస్తూ.

"మీరెళ్ళండి సర్! వీడి సంగతి మేం చూసుకుంటాం"—అతని పలుకుబడి తెలిసిన ఓ పోలీసాఫీసర్ వినయంగా అన్నాడు.

"సరి!సరి! రోడ్ త్వరగా క్లియరాఫ్ చెయ్యండి. ట్రాఫిక్ జామవుతోంది. ఇలాంటి వెధవల మూలంగానే ట్రాఫిక్‌కి అంతరాయం కలిగి ఇంతమంది బాధపడ్డం! వెధవ న్యూసెన్స్!" అనేసి గబగబా కారెక్కాడు దేశోద్ధారకుడు. మరుక్షణం కారు దూసుకుపోయింది రెట్టించిన వేగంతో. నేతాజీ శవం చుట్టూ చేరుకున్న జనాన్ని చెల్లాచెదురు చేస్తున్నారు పోలీసులు.

ఈ వార్త ఎలా తెలిసిందో, తన అశక్తత మర్చిపోయి తుపాన్‌లా వచ్చిపడింది పార్వతమ్మ. పోలీసులు వారిస్తున్నా వినకుండా మనవడి శవాన్ని ఒళ్ళోకి తీసుకుని గుండెలు పగిలేలా ఏడ్చింది. అక్కడికొక్కస్త దూరంగా వున్న ఓ ఆఫీసులోంచి వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం తాలూకు వేడుకల సందడిలో ఆమె ఏడుపు కలిసిపోయింది. కాస్సేపటికి దుఃఖావేశం తగ్గింది పార్వతమ్మకి.

మైక్‌లో వినిపిస్తున్న ప్రసంగాల్ని శ్రద్ధగా వినసాగింది.

సభ ముగిసింది.

పెద్దగా నవ్వింది పార్వతమ్మ. అందరూ త్రుళ్ళిపడి చూశారామెకేసి.

"భరత మాతా! నీ చెర విడిపించడానికి నా భర్త ఆహుతయ్యాడు!.. నీ బిడ్డల్ని రక్షించడానికి ప్రయత్నించి నా బిడ్డ అంతమయ్యాడు. ఇప్పుడు నాకున్న ఒకే ఒక వెలుగైన నా నేతాజీని ఈ ఉత్సవం తాలూకు సంరంభం పొట్టన పెట్టుకుంది. అయినా నిన్ను నిందించ నమ్మా! .. ఈ జనంలో మార్పు రావాలని కోరు తుంటాను. నిజమైన స్వాతంత్ర్యం ఏవిటో తెలుసు కోమని మాత్రం చెప్పమ్మా నీ ప్రజకి.

"స్వాతంత్ర్యం వచ్చింది.

సంవత్సరాని కొకసారి స్వాతంత్ర్యం రావడానిక్కారకులైన వారిని తలుచుకుని, జాతీయ గీతాలు పాడుకుని, ప్రతిజ్ఞలు చేస్తే చాలదనీ, మానవతావాదం, కుల మత భేదం రూపుమాపడం, పేదరిక నిర్మూలన అంటూ వేదికలెక్కి అరిచినంత మాత్రాన చాలదనీ, ఎంతో మంది ఆత్మాహుతి చేసి సంపాదించిన ఈ స్వరాజ్యాన్ని సస్యశ్యామలంగా చూసుకోమనీ నీ బిడ్డలకి చెప్పమ్మా" అంటూ బావురుమంది నేతాజీ మీదికి వాలిపిచ్చిదానిలా.

ఎవరో ఆమెని లేవదీయబోయారు. అయితే ఆమె లేవలేదు.

ఆమె ప్రాణాలు కూడా తన వారందరికోసం అనంతంలోకి పయనించాయి.

ఆమె చీర పచ్చగా వుంది.

ఆమె రవిక తెల్లగా వుంది.

నేతాజీ శరీరం మొత్తం రక్తంతో తడిసి ఎర్రగా అయిపోయింది.

ఆ మూడూ కలిసి జాతీయ జండాలా కనిపించాయి కొందరికి.

ఇదంతా చూస్తున్న భరతమాత 'నాకు స్వేచ్ఛ వచ్చిందా! నేను స్వతంత్రం వచ్చి సుఖంగా వున్నానా?" అని తనని తానే ప్రశ్నించుకుంది నిర్ఘాంత పోయినట్టు.